సాక్షి అనకాపల్లి

ఆదివారం । 5 । మే । 2024



గంటా కాపు కాదు... కాపుల ద్రోహి

గంటా శ్రీనివాసరావు కాపుల ద్రోహి అని కాపునాడు సమావేశంలో విశాఖ జిల్లా నాయకులు విమర్శించారు. 8లో



నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

తుమ్మపాల: ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగుల కోసం జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఆదివారం నుంచి ప్రారంభమవుతుంది.

గరిష్టం/కనిష్టం
37.8/28.2

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేక ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరీ తెలిపారు.

కుట్ర కోణం.. రౌడీ రాజకీయం

- హత్యా రాజకీయాలకు తెర లేపుతున్న సీఎం రమేష్
- ఎంపీ అభ్యర్థి ముత్యాల నాయుడు హత్యకు కుట్ర
- అనుమతి లేకుండా బూడి నివాసంపై డ్రోన్‌తో రెక్కీ
- బీజేపీ ఎంపీ అభ్యర్థి రమేష్ అనుచరులుగా గుర్తింపు
- ఇంకా ఎలాంటి విధ్వంసాలు చూడాలో అని జిల్లా ప్రజల భయాందోళనలు

ఓటమి భయం.. గూండాయిజంతో నెట్టుకురావాలన్న ప్రయత్నం.. ప్రత్యర్థిని హతమార్చయినా పదవి సాధించాలన్న మాయోపాయం.. వెరసి దేవరాపల్లి మండలంలో శనివారం సృష్టించిన ఘర్షణపూరిత వాతావరణం.. ఇది సీఎం రమేష్ రౌడీ రాజకీయానికి పరాకాష్ట. ప్రజాస్వామ్యానికే అప్రతిష్ట. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును హత్య చేసేందుకు పన్నాగం పన్నారన్నది ఆయన అభిమానుల భయాందోళన.. అందుకు ఊతమిచ్చేవిధంగా నిందితులను సీఎం రమేష్ వెనుకేసుకు రావడం, ముత్యాల నాయుడు ఇంటి వైపు దూసుకురావడం కుట్ర కోణాన్ని బలపరుస్తున్నాయి.

సాక్షి, అనకాపల్లి: అది ఆకతాయిల పని కాదు. అనుకోకుండా జరిగినది అంతకంటే కాదు. డ్రోన్‌తో ఏమైనా చిత్రీకరించాలంటే.. అదీ ఎన్నికల వాతావరణంలో.. మరీ ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఇంటిపై.. అనుమతి తీసుకోకుండా ఆ పని చేయకూడదని తెలియనివారు కాదు. అయినా సరే చేశారంటే.. తమపైనే దాడి జరిగిందని పోలీసులకు ఎదురు ఫిర్యాదు చేశారంటే వారి ఘర్షణపూరిత వైఖరి అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు సీఎం రమేష్ వారికి మద్దతుగా రాత్రి వరకు హైడ్రామా సృష్టించడంతో కుట్ర కోణం స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూల పవనాలకు తోడు.. మాడుగలను అభివృద్ధి పథంలో నడిపించి ఒక మోడల్ నియోజకవర్గంగా తయారు చేసిన బూడి ముత్యాలనాయుడికి ఉన్న ప్రజాదరణ చూసి సీఎం రమేష్‌కు చెమటలు పడుతున్నాయి. ఓటమి భయం రోజురోజుకూ అధికమవుతోంది. అందుకే ఆ ఆందోళన ఇలా వ్యక్తమయింది. తమపై దాడి జరిగిందని సీఎం రమేష్, అతని అనుచరులు సానుభూతి డ్రామా ఆడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సీఎం రమేష్ ఎదురుదాడి

డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ఇంటి వద్ద డ్రోన్‌తో రెక్కీ నిర్వహించిన వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారని తెలుసుకున్న సీఎం రమేష్ తన అనుచరులు, టీడీపీ కార్యకర్తలతో మధ్యాహ్నం సుమారు 4 గంటల ప్రాంతంలో దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తమ కార్యకర్తలపై దాడి చేసిన బూడి వర్గీయులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని.. లేకుంటే అమరావతి, ఢిల్లీ వరకు వెళ్లి ఫిర్యాదు చేస్తానని పోలీసులకు హెచ్చరిక జారీ చేశారు. ఘటన జరిగిన ముత్యాల నాయుడు ఇంటి వద్దకు వెళ్తానని సీఎం రమేష్ సిద్ధం కాగా శాంతిభద్రతల సమస్య తలెత్తుందని పోలీసులు నిరాకరించారు. పోలీసులను నెట్టుకుంటూ అనుచరులతో తారువ బయలుదేరి వెళ్లారు. ముత్యాలనాయుడి అనుచరవర్గం మోహరించి ఉందని తెలుసుకొని హనుమాన్ ఆలయం ముందు మెట్లపై సుమారు 2 గంటల పాటు కూర్చుండిపోయారు. తారువ గ్రామస్తులతో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో చేరుకొని రౌడీ రాజకీయం చేస్తే సహించేది లేదని హెచ్చరిక జారీ చేశారు. పరిస్థితి చేయి దాటిపోతుందని, వెంటనే ఇక్కడి నుండి వెళ్లి పోవాలన్న పోలీసుల సూచనలతో సీఎం రమేష్ పోలీస్ జీపు ఎక్కారు. సీఎం రమేష్ ఎక్కిన పోలీస్ జీపుకు అడ్డంగా గ్రామస్తులు బైఠాయించారు. తమ గ్రామం వచ్చి గుండాయిజం చేసి తమను రెచ్చకొట్టిన సీఎం రమేష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సుమారు అరగంటకు పైగా సీఎం రమేష్ ఎక్కిన పోలీస్ వాహనం నిలిచిపోయింది. పోలీస్ వాహనాన్ని చుట్టుముట్టడంతో సీఎం రమేష్, అతని అనుచర వర్గం భయంతో వణికి పోయారు. పోలీసులు అతి కష్టం మీద సీఎం రమేష్ ఎక్కిన వాహనాన్ని ముందుకు పంపించగా గ్రామస్తులు మాత్రం ఊరు పొలిమేర దాటే వరకు వెంబడించారు.



సీఎం రమేష్ రౌడీయిజంను నిరసిస్తూ ఆందోళనకు దిగిన తారువ గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దౌర్జన్యం.. దాడికి పాల్పడం పరిపాటి..

బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ విధుల్లో ఉన్న అధికారులపై దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడడం పరిపాటిగా మారింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అధికారులపై దౌర్జన్యం, దాడులకు పాల్పడినందుగాను గతంలో సీఎం రమేష్‌పై కేసులు కూడా నమోదు చేశారు. ఇటీవల అనకాపల్లి జిల్లా చోడవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో డీఆర్ఐ అధికారుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా వారిపై దాడి చేసినందుకు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అది కాకుండా.. గతంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫోర్జరీ కేసు, నెల్లూరు జిల్లా కావలి పోలీస్‌స్టేషన్ పరిధిలో కోవిడ్ 19 నిబంధనలకు విరుద్ధంగా అమరావతి రైతు సంఘం జేఏసీ పేరిట పాదయాత్ర నిర్వహించడం, కడప జిల్లా యర్రగుంట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2019 ఎన్నికల సమయంలో యర్రగుంట్లలోని ఓ ఎన్నికల బూత్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఒకరి కంటే ఎక్కువ మంది వెళ్లడంతో పాటు తన కారు డ్రైవర్‌తో కలసి పరిగపాటి వెంకట సుధాకర్‌పై దాడి చేసిన కేసు, హైదరాబాద్‌లో గల జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భూ వివాదం కేసు, హైదరాబాద్ లకిడీకాపూల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏపీ సెక్రటేరియట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సైఫాబాద్ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను దూషించడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ట్రాఫిక్‌ను అడ్డుకున్నందుకు గాను హైదరాబాద్ అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు, హైదరాబాద్‌లోని డెట్ రికవరీ ట్రిబ్యునల్ ఆదేశాలను పాటించనందుకు మరో కేసు సీఎం రమేష్‌పై నమోదు చేశారు.



దేవరాపల్లి స్టేషన్ వద్ద పోలీసులతో సీఎం రమేష్ వాగ్వాదం



తారువ వెళ్లకుండా వాహనాన్ని నిలువరిస్తున్న పోలీసులను తోసేస్తున్న సీఎం రమేష్ అనుచరులు



తారువ నుంచి వచ్చాక పోలీస్ స్టేషన్ వద్ద అనుచరులతో కలిసి బైఠాయించిన సీఎం రమేష్

న్యూస్‌రీల్

హోమ్ ఓటింగ్‌కు చక్కటి స్పందన

- రెండు రోజుల్లో సద్వినియోగం చేసుకున్న వారి సంఖ్య 641

తుమ్మపాల : జిల్లాలో రెండవ రోజు హోమ్ ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. కశింకోట మండలం తాళ్లపాలెం, బయ్యవరం గ్రామాల్లో జరుగుతున్న హోమ్ ఓటింగ్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా పరిశీలించారు. 85 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం ఉన్న వికలాంగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో శనివారం 375 మంది హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. దీంతో మొదటి రెండు రోజుల్లో 641 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అయింది. నియోజకవర్గాల వారీగా రెండవ రోజు పోలైన ఓట్ల పోలింగ్ సరళి ఇలా.. చోడవరం -40, మాడుగుల-48, అనకాపల్లి - 91, యలమంచిలి - 36, పాయకరావుపేట - 131, నర్సీపట్నం - 29 మంది. కాగా వీరిలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు- 144 కాగా.. దివ్యాంగులు - 231 హోమ్ ఓటింగ్ సేవలను సద్వినియోగం చేసుకున్నారు.

వచ్చే నెల 18న మాడుగుల మోదకొండమ్మ జాతర



మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ జాతరను వచ్చేనెల 18న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవ వివరాలను తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం 9.30 గంటలకు శతకంపట్టు వద్ద రాట ఉడుపు నిర్వహించనున్నట్టు చెప్పారు. 19వ తేదీ ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయం వద్ద చాటింపు వేయనున్నట్టు తెలిపారు. ఈనెల 21వ తేదీ ఉదయం అమ్మవారి ప్రతి రూపమైన ఘటాల ఊరేగింపు నిర్వహించి, కోట ఆవరణలో ఉన్న సతకం పట్టు వద్ద కొలువు దీర్చనున్నట్టు చెప్పారు. నెల రోజుల పాటు కొలువు దీరిన అమ్మవారు జూన్ 18న తిరిగి ఆలయానికి చేరుకోవడంతో నెల రోజుల పండగ పూర్తి అవుతుందన్నారు. పండగ నిర్వహణపై కమిటీ సమావేశాన్ని నిర్వహించినట్టు ఆయన చెప్పారు.

ఎపిక్, 11 రకాల గుర్తింపు కార్డులతో ఓటుహక్కు వినియోగం

తుమ్మపాల: ఎపిక్, 11 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకదానితో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. ఓటరు కార్డు లేని వారు ఓటు హక్కు వినియోగానికి ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకులు, తపాలాశాఖ జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్ పుస్తకాలు, కార్మిక శాఖ జారీ చేసిన హెల్త్ స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, పాస్ట్‌పోర్టు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసిన గుర్తింపుకార్డులు, దివ్యాంగుల గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీలకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డులతో స్వేచ్ఛగా ఓటు వేయవచ్చన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రియాన్ష్‌కు చోటు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన విద్యార్థి రియాన్ష్

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో యుకేజీ విద్యార్థి బి.రియాన్ష్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించాడు. ఐదేళ్ల రియాన్ష్ ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఎంపిక ప్రక్రియలో కేవలం 9 సెకన్లలో దక్షిణ అమెరికా ఖండంలో 13 దేశ జెండాలను గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించాడు. అంతేకాకుండా ఈ విద్యార్థి ప్రపంచ పటంలో దేశాలను గుర్తించడంతో పాటు ప్రపంచ దేశ రాజధానులను, భారతదేశ రాష్ట్రాల రాజధానులను గుర్తించడంలో కూడా ప్రతిభ కనబరుస్తున్నాడు. ఆ విద్యార్థి ప్రతిభకు విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ అభినందనలు తెలిపారు.

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- సీఈవో ముఖేష్ కుమార్ మీనా
- కమాండ్ కంట్రోల్ రూమ్, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన సీఈవో

తుమ్మపాల: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను, ఎస్పీ కార్యాలయం సమీపంలోని స్ట్రాంగ్ రూమ్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు ఓటుహక్కును తప్పని సరిగా వినియోగించుకునేలా చూడాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. వివిధ విభాగాల ద్వారా ఎన్నికల ప్రక్రియకు అనుసరిస్తున్న విధానాలను గురించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి వివరించారు. చెక్‌పోస్ట్‌ల వద్ద నిఘా, జీపీఎస్ వాహన ట్రాకింగ్, వెబ్ కాస్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఫిర్యాదుల విభాగం, హోమ్ ఓటింగ్ విధానాలను గురించి వివరించారు. వివిధ విభాగాల నోడల్ అధికారులను పరిచయం చేశారు. ముందుగా ఎంసీఎంసీ రూమ్‌లో ఏర్పాటు చేసిన న్యూస్ వాచింగ్, ఫిర్యాదుల విభాగంలో నిర్వహిస్తున్న పనులను నోడల్ అధికారి జి.వి.లక్ష్మి వివరించారు. ప్రకటనలు, సర్టిఫికెట్ల మంజూరు, వివిధ టీవీ చానళ్లు, సోషల్ మీడియాలలో వస్తున్న స్క్రోలింగ్‌లపై చేపడుతున్న చర్యలను తెలిపారు. వివిధ వార్తా పత్రికల్లో వచ్చే పెయిడ్ న్యూస్‌పై తీసుకుంటున్న చర్యలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గం ఆర్వో, జేసీ ఎం.జాహ్నవి, ఎంసీఎంసీ ప్రత్యేకాధికారి, ఫిషరీష్ డీడీ పి.ప్రసాద్, ఎంసీసీ నోడల్ అధికారి డీపీహెచ్‌వో బి.ప్రసాద్, ఎక్స్‌పెండీచర్ కమిటీ నోడల్ అధికారి ఎల్.డి.ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ రూమ్ కార్యకలాపాలను తెలుసుకుంటున్న సీఈవో ముఖేష్‌కుమార్ మీనా



తాళ్లపాలెంలో హోమ్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న సీఈవో ముఖేష్‌కుమార్ మీనా

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

కశింకోట: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా కోరారు. తాళ్లపాలెంలో హోం ఓటింగ్ నిర్వహిస్తున్న తీరును శనివారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి తదితరులున్నారు. కశింకోటలో రెండు రోజులపాటు నిర్వహించిన హోం ఓటింగ్‌లో 57 మందికి గాను 56 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

టీడీపీ, జనసేన పార్టీలకు షాక్

- ఉద్దండపురంలో 200 మంది నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

నక్కపల్లి: టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజల్లో విశ్వసనీయత లేదంటూ మండలంలోని ఉద్దండపురంలో 50 కుటుంబాలకు చెందిన 200 మంది శనివారం ఆ పార్టీలకు రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారు. సర్పంచ్ పాడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ బచ్చలరాజుల ఆధ్వర్యంలో చేరిన వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో గాదంరాజు, పాలూరి రాజబాబు, కొంతం నాగయ్య, అమలకంటి రాజు, పాలూరు ఈశ్వరరావు, పాడగట్ల రాంబాబు, పాలూరి శ్రీను, గొల్లపల్లి నగేష్, పాడగట్ల బాబ్జి, పాడగట్ల నాగేశ్వరరావు, రామకృష్ణ, పాలూరి బాబూరావు, బుద్ద నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. వీరంతా మాట్లాడుతూ జనసేన పార్టీలో ఉంటే జెండా కూలీలుగానే ఉండిపోవాల్సి వస్తుందన్నారు. పవన్‌కల్యాణ్‌ను సీఎంగా చూడాలనుకున్నామని, అతను మాత్రం వేరొకరిని చేయడానికి సిద్ధపడుతున్నాడని విమర్శించారు. పదేళ్లయినా పార్టీని పటిష్టపరచలేని వ్యక్తి అధికారంలోకి ఎలా వస్తాడన్నారు. ఇక టీడీపీపైనా ప్రజల్లో నమ్మకం లేదన్నారు. అవ్వాతాతలకు పింఛను ఇంటికి తెచ్చి ఇవ్వకుండా అడ్డుకున్న దుర్మార్గుడన్నారు. అధికారంలోకి రాక ముందే సంక్షేమాన్ని అడ్డుకుంటున్నాడని, తీరా గెలిపిస్తే పథకాలన్నీ ఆపేస్తారన్న అభద్రతాభావం ప్రజల్లో నెలకొందన్నారు. ఈ రెండు పార్టీలు ప్రతిపక్ష హోదాకు కూడా పనికిరావన్నారు. సంక్షేమం అనేది ఒక్క జగనన్నతోనే సాధ్యమన్నారు. జగనన్నకు ఓటేయకపోయినప్పటికీ తమకు పలు పథకాలు వర్తింపజేసిన మంచి వ్యక్తి అన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను అందరికి అందించిన జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించుకుని ఆయన రుణం తీర్చుకుంటామన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పాడగట్ల పాపారావు, రాఘవ, గోపి, సూరిబాబు, నాయకులు పాల్గొన్నారు.



టీడీపీ, జనసేన నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగులు

తొలివిడత చందనం అరగదీత ప్రారంభం

- సింహగిరిపై శాస్త్రోక్తంగా పూజలు



చందనాన్ని అరగదీస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈ నెల 10న వైశాఖ శుద్ధ తదియ రోజు జరిగే అప్పన్న చందనోత్సవం (నిజరూప దర్శనం) అనంతరం ఆ రోజు రాత్రి స్వామికి తొలివిడత సమర్పించాల్సిన మూడు మణుగుల పచ్చి చందనాన్ని (120 కిలోలు) సమకూర్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఏకాదశిని పురస్కరించుకుని శనివారం ఉదయం 7 గంటల నుంచి దేవస్థానం అర్చకులు సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత బేడా మండపంలోని భాండాగారం వద్ద తొలి చందనం చెక్కను ఉంచి పూజలు చేసిన అనంతరం చందనం చెక్కతో ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు బేడా ప్రదక్షిణ చేశారు. అనంతరం చందనం చెక్కను ముందుగా శ్రీనివాసాచార్యులు, అనంతరం ఆలయ ప్రధానార్చకుడు-2 ఇరగవరపు రమణాచార్యులు, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు అరగదీసి, ఆ చందనాన్ని స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు.

పాల్మన్‌పేటలో టీడీపీకి ఉపాధి కూలీల ఝలక్



పనులు చేసే చోట ప్రచారం చేయొద్దంటూ టీడీపీ నాయకులను అడ్డుకుంటున్న ఉపాధి కూలీలు

- పనులు ఆపొద్దని ఆగ్రహం
- ప్రచారానికి రావొద్దని నినాదాలు

నక్కపల్లి: పాయకరావుపేట మండలం పాల్మన్‌పేటలో టీడీపీ ప్రచారానికి ఉపాధి కూలీలలకు ఝలక్ ఇచ్చారు. ఎన్నికలు ప్రచారంలో భాగంగా శనివారం గ్రామంలో జరు గుతున్న ఉపాధి పనుల వద్దకు టీడీపీ నాయకులు వెళ్లారు. పనులు ఆపేసి ఒక్కసారి తమ ప్రసంగాన్ని వినాలని కొంతమంది టీడీపీ నాయకులు కోరడంతో పనుల్లో నిమగ్నమైన కూలీల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మీ ఎన్నికల ప్రచారాన్ని గ్రామాల్లో చేసుకోవాలని, పనులు జరిగే చోటకు వచ్చి మా పనులను గంటల తరబడి నిలిపివేయడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. మండు టెండలో పొట్టకూటి కోసం మేమంతా కష్టపడుతున్నామని, రెండు గంటలకు మించి పనులు చేయలేకపోతున్నామని, ఈ రెండు గంటల సమయంలో మీరు వచ్చి గంట సమయం ప్రచారం కోసం వృథా చేస్తే ఎలా అంటూ నిలదీసారు. మాకు కూలి గిట్టుబాటు కాదని వెంటనే ప్రచారం ముగించి వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కూలీలకు, టీడీపీ నాయకులకు మధ్య కొద్ది సేపు వాగ్వాదం జరిగింది. మహిళలంతా తిరగబడడంతో టీడీపీ నాయకులు వెనుతిరిగారు. కొంతమంది కూలీలు మాట్లాడుతూ పథకాలన్నీ ఆపేస్తూ ఇప్పుడు ఓట్లడగానికి ఎలా వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘వలంటీర్లు ఇంటికి తెచ్చి పింఛని ఇత్తంటే చంద్రబాబు నాయుడు ఆపేసాడంట, మా ముసలోళ్లంతా బ్యాంకుల చుట్టు తిరగడానికి చానా ఇబ్బంది పడతన్నారు. ఇప్పుడు సిగ్గులేకుండా ఓట్లడగడానికి వత్తన్నారు..’ అంటూ దుమ్మెత్తిపోశారు. ఎంచక్కా జగన్ బాబు తమకు అన్ని పథకాలు ఇస్తున్నాడని, తమ ఓటు ఫ్యాన్ గుర్తుకేనని చెప్పారు. వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

గంటా కాపు కాదు.. కాపుల ద్రోహి

- పోటీ చేసే చోట ప్రజలకు అందుబాటులో ఉండడు
- 'ఉత్తర'లో గెలిపించి తప్పు చేశాం..
- కాపులకు వైఎస్సార్‌సీపీ 18 శాతం సీట్ల కేటాయింపుపై హర్షం
- రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి
- కాపునాడు విశాఖ జిల్లా అధ్యక్షుడు తోట రాజీవ్


సమావేశంలో కాపునాడు జిల్లా అధ్యక్షుడు తోట రాజీవ్, విశాఖ జిల్లా కాపునాడు నాయకులు

మధురవాడ : గంటా శ్రీనివాసరావు కాపు కాదని.. కాపుల ద్రోహి అని.. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ తీసుకొచ్చి కాపునని నిరూపించుకోగలరా? అని కాపునాడు విశాఖ జిల్లా నాయకులు సవాల్ విసిరారు. పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద గల శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో కాపునాడు విశాఖ జిల్లా అధ్యక్షుడు తోట రాజీవ్, నాయకులు శనివారం మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేశారని, ఈ ఎన్నికల్లో కాపులకు 18 శాతం సీట్లు కేటాయించి రాజ్యాధికారం దిశగా ముందుకు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కాపులకు 31 అసెంబ్లీ, 5 ఎంపీ సీట్లు కేటాయించగా.. టీడీపీ కేవలం 12 సీట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. దీనిని బట్టి చంద్రబాబుకు కాపులు మీద ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అందుకే తాము ఈ ఎన్నికల్లో ఏ పార్టీ కాపులకు ఎక్కువ సీట్లు కేటాయిస్తే ఆ పార్టీకే మద్దతు తెలపాలని నిర్ణయం తీసుకుని... వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపామన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్ర వ్యాప్తంగా కృషి చేస్తామన్నారు. విద్యావేత్త, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే ముత్తంశెట్టి శ్రీనివాసరావును భీమిలి ఎమ్మెల్యేగా, తూర్పు కాపు మహిళ, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందిన బొత్స ఝాన్సీలక్ష్మిని విశాఖ ఎంపీగా, గాజువాక ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించుకుంటామన్నారు. వీరి గెలుపుతో విశాఖ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

చిరంజీవిని మోసం చేసింది గంటానే..

ప్రజారాజ్యం పార్టీలో చిరంజీవికి తీరని ద్రోహం చేసింది గంటా శ్రీనివాసరావు అని జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్ పలుమార్లు ఆరోపించారని తోట రాజీవ్ అన్నారు. చంద్రబాబు తనకు, తన కుమారుడు లోకేష్‌కు గత ఐదేళ్లలో చేసిన అవమానాలు మరిచిపోయి కేవలం డబ్బు కోసం గంటాకు టికెట్ అమ్ముకోవడం బాధాకరమన్నారు. కాపుల ద్రోహి, భూ కబ్జాలు చేసే వ్యక్తి గంటా అని తోట రాజీవ్ ఘాటుగా విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులను మండలాలు, వార్డులు ఇన్‌చార్జులుగా నియమించి వాడుకుంటున్నాడన్నారు. అతడిని ఉత్తర నియోజకవర్గంలో గెలిపించి తప్పు చేశామన్నారు.

కాపు అని గంటా నిరూపించుకోవాలి

రాష్ట్ర కాపునాడు గౌరవ సలహాదారు, ఏపీ రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకా మోహన్‌రావు మాట్లాడుతూ గంటా శ్రీనివాసరావు అసలు కాపు కాదని, అతడు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ చూపించి కాపుగా నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎంతో మంది వద్ద డబ్బులు తీసుకుని యువతను ఇబ్బంది పెట్టాడన్నారు. ఆయన భూ కబ్జాల వల్లే సిట్ వచ్చిందని, ఇద్దరు తహసీల్దార్లు జైలుకు వెళ్లారన్నారు. గంటాతో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ ఆనందపురం మాజీ మండల అధ్యక్షుడు బొద్దాపు శ్రీనివాస్ మాట్లాడుతూ గంటా పాలన అంతా అతని కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు ఇప్పించుకుని, దోచుకోవడానికే సరిపోయిందన్నారు. తాము శొంఠ్యాంలో పాఠశాల భవనం కాంట్రాక్ట్ తీసుకుని నిర్మిస్తే బిల్లు రానీయకుండా గంటా చేశారన్నారు. సమావేశంలో కాపు సంఘం నాయకులు వంకాయల మారుతీ ప్రసాద్, పతివాడ శ్రీనివాస్, అల్లాడ వెంకటరావు, అల్లాడ లింగేశ్వరరావు, దేవరపు శ్రీనివాసరావు, ఆదాల సురేష్, వి.పెద బాబు, జి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

భీమిలికి గంటా అవసరం లేదు

గంటా అవసరం లేదని భీమిలి ప్రజలు అంటున్నారని, పవన్ కల్యాణ్‌ను కూడా పలుమార్లు తిట్టాడని, ఇలాంటి వ్యక్తికి టీడీపీ ఎంత తీసుకుని టికెట్ ఇచ్చిందని ప్రశ్నించారు. నోటి కాడ కూడు లాక్కోవడం గంటా నైజమన్నారు. గతంలో ఓట్ల కోసం అనుమతులు లేకుండా మంత్రి పదవిని దుర్వినియోగం చేసి కాపు భవనానికి శంకుస్థాపన చేయడం కుల ద్రోహమే అవుతుందన్నారు. అవినీతి, నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే ప్రతీ ఎన్నికకూ నియోజకవర్గం మారుస్తుంటాడని విమర్శించారు. అతడు పోటీ చేసిన ప్రాంతంలో కొన్ని వేల కోట్ల రూపాయల విలువ చేసే వివాదాస్పద భూములు ఆక్రమించిన సంస్థలు గంటా శ్రీనివాసరావుకి బాసటగా నిలిచి ఎన్నికల్లో డబ్బులు పెట్టుబడి పెట్టడానికి ముందుకు రావడం వాస్తవమన్నారు. ఇటీవలే టీడీపీ ఆనందపురం మండల ప్రెసిడెంట్ పదవికి రాజీనామా చేసిన బొద్దాపు శ్రీను పొందుపరిచిన కారణాలే సాక్ష్యమన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై సీఎం రమేష్ మోసపూరిత వాగ్దానం

- దమ్ముంటే రద్దు చేస్తామని ప్రధానితో చెప్పించాలి
- సీపీఎం నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: రావికమతంలో బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ తాను గెలిస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయిస్తానని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ తెలిపారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చి ఆగమేఘాల మీద అమలు చేసిందని సీఎం రమేష్ కొత్త డ్రామాకు తెరతీయడం విడ్డూరంగా ఉందన్నారు. నీతిఆయోగ్ ప్రతిపాదించిన ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వాస్తవాన్ని దాచిపెట్టడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే దీన్ని రద్దు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దమ్ముంటే ఈ నెల 6న అనకాపల్లికి వస్తున్న ప్రధానమంత్రి మోదీతో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతిపాదన వెనక్కి తీసుకుంటామని చెప్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనువాసరావు, అల్లు రాజు, బొప్పే ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బాలయ్యా..ఇదేం గోలయ్యా..!

- బాలకృష్ణ పర్యటనతో జనానికి ఇబ్బందులు
- ఊకదంపుడు ప్రసంగంతో బేజారు
- స్థానిక సమస్యలపై అవగాహన లేమి
- టీడీపీ నేతల్లో కనిపించని జోష్


బాలకృష్ణ వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం

యలమంచిలి : ఊకదంపుడు ప్రసంగం, సొంత కుటుంబం గురించి గొప్పలు, ప్రభుత్వంపై నిష్కారణంగా దుమ్మెత్తి పోయడం తప్ప కనీసం స్థానిక సమస్యలపై అవగాహన లేమి, టీడీపీ డప్పు తప్ప పొత్తు కూటమిలోని జనసేన, బీజేపీల గురించి ప్రస్తావించని వైనం...మొత్తంగా సినీ నటుడు, టీడీపీ నాయకుడు బాలకృష్ణ ఎన్నికల ప్రచారం ఇటు జనంలోనూ అటు ఆ పార్టీ వర్గాల్లోనూ జోష్ నింపకపోగా బాలయ్యా... ఇదేం గోలయ్యా అని నిట్టూర్చేలా చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం బాలకృష్ణ యలమంచిలి నియోజకవర్గంలో పర్యటించారు. కూటమి నాయకులు ఆయనకు గజమాలతో స్వాగతం పలికి ప్రచార వాహనం పైకి ఆహ్వానించారు. ఆయన ప్రసంగిస్తూ అభ్యర్థులు, వారి పేర్లు కూడా పలకడంలో ఇబ్బందులు పడడంతో కూటమి నేతలు ఉసూరుమన్నారు. ఈ ప్రాంతం పేరేమిటి? ఏం మాట్లాడాలి ? అని బాలకృష్ణ స్థానిక నేతల చెవిలో అడగడంతో జనం విస్తుపోయారు. తన కుటుంబం గురించి పదే పదే మాట్లాడడం, స్థానిక సమస్యలపై అవగాహన లేక ఏం మాట్లాడాలో అర్థం కాని ఊకదంపుడు ప్రసంగం చేయడంతో ప్రజలు విసుగు చెంది బాలకృష్ణ ప్రసంగిస్తుండగానే వెళ్లిపోవడం ప్రారంభించారు. అంతకుముందు ఆయన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజులపై విమర్శలు చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలు రాక వేరే ప్రాంతాలకు తరలిపోయాయని, మద్యం పాలసీతో ప్రజలను అనారోగ్యానికి గురి చేసి ఆసుపత్రి పాలు చేశాడంటూ ఆయన చేసిన విమర్శలకు ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. స్థానిక నేతలకు కూడా ఆయన మాట్లాడడానికి అవకాశం కల్పించకపోవడంతో వారు అసహనానికి లోనయ్యారు. బాలకృష్ణ ప్రసంగిస్తుండగా ప్రచార వాహనం ముందు టీడీపీ, జనసేన నడుమ వివాదం చోటు చేసుకుంది. సభకు వచ్చిన కూటమి కార్యకర్తలకు నగదును టీడీపీ నాయకులు సభా ప్రాంగణం వద్దే పంపిణీ చేపట్టారు. దీంతో మందుబాబులు డబ్బుల కోసం కొంత హడావుడి చేశారు. బాలకృష్ణ పర్యటన కారణంగా గంటన్నరపాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

రావికమతం : రావికమతం మండలం కొత్తకోటలో కూడా బాలకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మైక్ సరిగా పనిచేయక, ఆయన గొంతు బొంగురుగా ఉండడంతో ఏం మాట్లాడిందీ జనానికి అర్థం కాలేదు. కూటమి అంటే జగన్‌పై పాశుపతాస్త్రం అంటూ ఎమ్మెల్యే అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజును గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ లేకపోవడంతో ఆయన ఫొటోను చూపిస్తూ గెలిపించాలని కోరారు.

చోడవరంలో 102 మంది వలంటీర్ల రాజీనామా


కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న చోడవరం వలంటీర్లు

చోడవరం: నియోజకవర్గ కేంద్రం చోడవరం మేజర్ పంచాయతీలో 102 మంది వలంటీర్లు తమ బాధ్యతలకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ సెక్రటరీ నారాయణరావుకు శనివారం వారు అందజేశారు. టీడీపీ నాయకులు తమపై చేసిన అనుచిత వ్యాఖ్యలతో మనస్తాపం చెంది తామంతా రాజీనామా చేశామన్నారు.

మరో పక్క ఎన్నికల కమిషన్ వలంటీర్లను విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించడంతో ఇప్పటికే వారి నుంచి ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలన్నీ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. చోడవరం పంచాయతీలో ఐదు సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 105 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరిలో 102 మంది రాజీనామా చేశారు.

ఎస్.రాయవరంలో 48 మంది వలంటీర్లు..


ఎంపీడీవోకి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వాకపాడు వలంటీర్లు

ఎస్.రాయవరం: మండలంలో గ్రామ లవారీగా వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నారు. వాకపాడు, ఎస్.రాయవరం, పెనుగొల్లు, పెట్టుగొళ్లపల్లి, కొరుప్రోలు తదితర గ్రామాలకు చెందిన 48 మంది వలంటీర్లు రాజీనామా చేసి శనివారం ఎంపీడీవో సత్యనారాయణకు అందజేశారు. ఇకపై తామంతా స్వచ్ఛందంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గెలుపుకోసం పని చేస్తామన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లు తంతటి అప్పారావు, బైపా ముసలయ్య, బంగారి సంధ్య, బైపా విజయశ్రీ, జేమ్స్, ఉదయ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తీర్మానాలు లేకుండా ముగిసిన మండల సమావేశం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి రూరల్: యలమంచిలి మండల పరిషత్ సమావేశం శనివారం ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి తీర్మానాలు, చర్చలు లేకుండానే సమావేశాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజాన శేషగిరిరావు(శేషు), వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర,ఎంపీడీవో కార్యాలయం సూపరింటిండెంట్ ప్రసాదరావు,మండల ఇంజినీర్ సోమశేఖర్, పలువురు ఎంపీటీసీలు,సర్పంచ్‌లు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూడిమడక,దిబ్బపాలెంలో పోలీసుల కవాతు



దిబ్బపాలెంలో పోలీసులు

అచ్యుతాపురం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు గానూ పోలీసులు పలు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో కవాతు నిర్వహిస్తూ ప్రజల్లో ధైర్యాన్ని కలిగిస్తున్నారు.శనివారం మండలంలోని దిబ్బపాలెం,పూడిమడకలో కవాతు నిర్వహించారు.సీఐ బుచ్చిరాజు,ప్రత్యేక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావును సత్కరిస్తున్న సిబ్బంది

అచ్యుతాపురం: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఆర్.వెంకటరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పాఠకులతో ఆయన మమేకమయ్యారు.అనంతరం వెంకటరావును అచ్యుతాపురం గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు, యలమంచిలి గ్రంథాలయాధికారి ఆనందరావు,వాడచీపురుపల్లి గ్రంథాలయాధికారి అజయ్,పాఠకులు సన్మానించారు.

ప్రభుత్వ పింఛన్‌దార్ల సమస్యల పరిష్కారానికి కృషి




జిల్లా ఖజానాధికారి సుభాషిణికి నూతన కమిటీ వివరాలను అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి: ప్రభుత్వ పింఛన్‌దారుల సమస్యలు పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామని పింఛన్‌దారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వద్దాది జగన్నాథరావు తెలిపారు. స్థానిక జిల్లా ఖజానాధికారి వి.ఎల్.సుభాషిణికి జిల్లా నూతన అసోసియేషన్ కమిటీ వివరాలను అసోసియేషన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి కేంద్రంగా కొత్తగా జిల్లా ఏర్పడడంతో నూతన కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బి.ఎల్.ఎన్.శర్మ, సీహెచ్ సోమేశ్వరరావు, వి.గజ్జాలమ్మ, ఇ.సాంబమూర్తి, కె.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ప్రసన్న వదనం	: రాజా
శబరి	: సత్యనారాయణస్క్రీన్-1
టెనెంట్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటే అడక్కు	: పర్తిసాయి
రత్నం	: వెంకటేశ్వర
పారిజాత పర్వం	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 1,699 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,120	4,760
మొదటి రకం	3,720	4,800
రెండో రకం	3,600	4,250
మూడో రకం	3,210	3,570

డెవలప్‌మెంట్ వాచ్

అనకాపల్లి పట్టణంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గతంలో శిథిల రోడ్లు, పార్కులతో నిండి ఉండే పట్టణం ఇప్పుడు అందమైన భవనాలు, పార్కులు, రోడ్లతో దర్శనమిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రగతి వెలుగులు విరజిమ్ముతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఐదేళ్లలో కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు నిర్వహించారు. రూ.59 లక్షల వ్యయంతో నిర్మించిన శాంతి పార్కు చిన్నారులకు, పెద్దలకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఎన్టీఆర్ క్రీడామైదానంలో రూ.70 లక్షలతో నిర్మించిన డార్మెటరీ భవనంతో మహిళా క్రీడాకారులకు వసతి సౌకర్యం కలిగింది. రూ. 2కోట్లతో సుంకరమెట్ జంక్షన్ నుంచి శారదానది వంతె వరకు, నెహ్రూ చౌక్ నుంచి గుండా జంక్షన్ వరకు ఏర్పాటు సెంట్రల్ లైటింగ్ పట్టణంలో వెలుగులు విరజిమ్ముతోంది.

– అనకాపల్లి



భీమునిగుమ్మం హైస్కూల్ ఆవరణలో రూ.2కోట్లతో డిజిటల్ తరగతుల నిర్వహణకు వీలుగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం



జలగలమదం నుంచి సుంకరమెట్ట వరకు నిర్మించిన రహదారి



రూ. 2 కోట్లతో సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదానది వంతె వరకు, నెహ్రూ చౌక్ నుంచి గుండా జంక్షన్ వరకు ఏర్పాటు సెంట్రల్ లైటింగ్



ఎన్టీఆర్ క్రీడామైదానంలో మహిళా క్రీడాకారులకు రూ.70 లక్షలతో నిర్మించిన డార్మెటరీ భవనం



రూ. 59 లక్షలతో శారదానది ఒడ్డున నిర్మించిన శాంతిపార్కులో చిన్నారులు

ఈవీఎంల పనితీరుపై అవగాహన అవసరం



పీవోలు,ఏపీవోలకు అవగాహన కల్పిస్తున్న రిసోర్సు పర్సన్ పద్మారావు

యలమంచిలి రూరల్: ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై పీవోలు,ఏపీవోలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని రిసోర్సు పర్సన్లు సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు పీవోలు,ఏపీవోలకు ఈవీఎంల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. శనివారం యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియోజకవర్గంలో పీవోలు,ఏపీవోలకు రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. పోలింగ్ ప్రారంభం నుంచి పూర్తయ్యేవరకు పూర్తి అప్రమత్తంగా ఉండాలని మాస్టర్ రిసోర్స్ పర్సన్ పద్మారావు తెలిపారు. పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ ఎలా నిర్వహించాలో ఎన్నికల సిబ్బందికి తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు పీవోలు,ఏపీవోలు ఈవీఎంల పనితీరు, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలు,సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే చేపట్టాల్సిన అత్యవసర చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

అనకాపల్లి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సిద్ధార్థా సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన కరపత్రాలను స్థానిక చిన్నరాజుపేట అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వినకోట నిలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకటో అదనపు న్యాయమూర్తిగా రమేష్



న్యాయమూర్తి ప్రదీపాను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి: స్థానిక న్యాయస్థానంలో ఒకటో అదనపు న్యాయమూర్తి (జూనియర్ సివిల్ జడ్జి)గా ఎ.రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం కోర్టులో విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చినట్టు అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి వెంకట లక్ష్మణరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కోర్టులో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వహించిన పి.ప్రదీపా గాజువాక కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి న్యాయమూర్తి పి.ప్రదీపాను దుశ్శాలువాతో సత్కరించారు.

బీఎల్‌వోల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ



మునగపాకలో ఓటరు స్లిప్పులు అందజేస్తున్న బీఎల్‌వో వీరునాయుడు

మునగపాక: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పుల పంపిణీ చురుగ్గా సాగుతోంది. పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి స్లిప్పులు అందజేస్తున్నారు. మునగపాక 165 పోలింగ్ బూత్‌కు సంబంధించిన స్లిప్పులను బీఎల్‌వో వీరునాయుడు ఓటర్లకు పంపిణీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం



మునగపాకలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీటీసీ రూపావతి

మునగపాక: స్థానిక బీసీ కాలనీని ఆనుకొని అభయాంజనేయ స్వామి కమ్యూనిటీ హాల్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎంపీటీసీ,వైఎస్సార్‌సీపీ మహిళా నేత రాజాన రూపావతి శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చలివేంద్రాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు, కారుకొండ స్వరూప్, కార్తీక్, ఆడారి షణ్ముక,చాణిక్య, రాజాన ప్రియాంక, రాజాన అర్నీషా, హైందవి, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

అతుల్ కుమార్‌కు ఘన నివాళి

అనకాపల్లి: దివంగత సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్‌కు ఆపార్టీ జిల్లా సహాయకార్యదర్శి రాజాన దొరబాబు శనివారం ఘనంగా నివాళులర్పించారు.స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో అతుల్‌కుమార్ అంజన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా ప్రచారం



పెదకలవలాపల్లిలో ప్రచారం చేస్తున్న సుకుమారవర్మ



గణపర్తిలో ప్రచారం చేస్తున్న సచివాలయ కన్వీనర్ అప్పలనాయుడు



గోవిందరావు కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లిబాబు



ఉమ్మలాడలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



తాళ్లపాలెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్

రాంబిల్లి: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజు తనయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ (తేజ) అన్నారు. శనివారం ఆయన రాంబిల్లి, గోవిందపాలెం, పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి రమణమూర్తిరాజు(కన్నబాబు),ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎటువంటి అక్రమాలకు తావులేకుండా ఇంటి వద్దే పథకాలు అందాలంటే జగనన్నకు అండగా నిలవాలని కోరారు.

మునగపాక: మండలంలో ప్రచారం జోరందుకుంది. ఎన్నికల తేదీ సమీపిస్తుండడంతో ఇంటింటికీ వెళ్లి ముమ్మరంగా ప్రచారం చేస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మండలంలోని గణపర్తిలో శుక్రవారం గణపర్తి సచివాలయ కన్వీనర్ చదరం అప్పలనాయుడు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు.పార్టీ సీనియర్ నాయకులు కాండ్రేగుల సీతారామ్ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మలాడలో పార్టీ నాయకులు సూరిశెట్టి రామకృష్ణ(ఎస్ఆర్) ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.

కశింకోట: మేజర్ పంచాయతీలైన కశింకోట, తాళ్లపాలెంలలో శనివారం రాత్రి గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.కశింకోటలోని గోవిందరావు కాలనీ వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాళ్లపాలెంలో పార్టీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేసి కర పత్రాలను పంపిణీ చేశారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, పక్కన ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

- ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

కశింకోట: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి, పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని చెరకాం, తీడ, ఈ.చౌడువాడ, సుందరయ్యపేట, అడ్డాం, జి.భీమవరం గ్రామాల్లో అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌తో కలిసి శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటా ప్రచారం , రోడ్డు షో నిర్వహించారు. అడుగడుగునా మహిళలు హారతులు పట్టి విశేషంగా ఆదరించారు. ఈ సందర్భంగా బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని, మరింతగా అభివృద్ధి సాధించాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిపిస్తే అనకాపల్లిని మరింతగా అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

కశింకోట: మండలంలోని కొత్తపల్లి, బుచ్చియ్యపేట గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి తమ మద్దతును అందించాలని ఈ సందర్భంగా కోరారు. పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ కార్యకర్త నత్తల శ్యామ్యుల్ తమ అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. కండువాలు కప్పి భరత్ కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కలగా గున్నయ్యనాయుడు, మలసాల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే అన్ని వర్గాలకు మేలు



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: ప్రతి ఒక్కరికీ మేలు జరగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. మండలంలోని యాదగిరిపాలెం,గణపర్తి, మెలిపాక,చూచుకొండ గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులకు అందాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

అనకాపల్లి ఎంపీగా బూడి ముత్యాలనాయుడు, యలమంచిలి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,సర్పంచ్‌లు అయినంపూడి విజయభాస్కరరాజు, చదరం నాయుడు,దొడ్డి సూరప్పారావు,సచివాలయ కన్వీనర్లు చేకూరి రామరాజు, గుంట్ల అప్పారావు, చదరం అప్పలనాయుడు, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రమణమూర్తి రాజు

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

రాంబిల్లి: గోకివాడలో టీడీపీకి చెందిన శానాపతి శివతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. యలమంచిలి నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ ఎస్.వి. సూర్యనారాయణ మాస్టారు ఆధ్వర్యంలో చేరిన వారికి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ముత్యాలనాయుడును గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరిషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సిరసపల్లి రామారావు, ద్వారపురెడ్డి గోవిందరావు, నందవరపు రాఘవరావు పాల్గొన్నారు.

పండుటాకులకు తప్పని అగచాట్లు

కశింకోట: సామాజిక పింఛన్ సొమ్ము కోసం శనివారం కూడా అవ్వాతాతలు ఇబ్బందులను ఎదుర్కొనక తప్ప లేదు. బ్యాంకులు, పంచాయతీ, సచివాలయ కార్యాలయాల చుట్టూ తిరిగారు. కొందరికి బ్యాంకు అక్కౌంట్లలో పింఛన్ సొమ్ము జమ కాక, మరికొందరికి బ్యాంకు అక్కౌంట్లు లేకపోవడం, ఉన్నా వాటిని చాలా కాలంలో వినియోగించకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

నాలుగు రోజులుగా తిరుగుతున్నాను..



పింఛన్ సొమ్ము కోసం నాలుగు రోజులుగా కాళ్లు అరిగేలా తిరుగుతున్నాను. బ్యాంకుకు, సచివాలయ కార్యాలయానికి తిరిగితే చివరికి పోస్టాఫీసు అక్కౌంట్‌లో పింఛన్ సొమ్ము పడిందని వెళ్లమన్నారు. కశింకోట పోస్టాఫీసుకు వెళితే ఇక్కడ చెల్లించడానికి అవకాశం లేదని, దూరంగా ఉన్న వెదురుపర్తిగాని, సంపతిపురం పోస్టాఫీసుకు గాని వెళ్లి తీసుకోమంటున్నారు. దీంతో ఎటూ పాలుపోక సతమతమవుతున్నాను. గతంలో వలే వలంటీర్ల ద్వారా పింఛన్ సొమ్మును ఇళ్లకు అందిస్తే సౌకర్యంగా ఉంటుంది.

–సూరిశెట్టి అప్పారావు, గవరపేట, కశింకోట.

ఇబ్బందులు పడ్డాను



మండుటెండలో సుదూరంగా ఉన్న గ్రామం నుంచి కశింకోట వచ్చి బ్యాంకులో పింఛన్ సొమ్ము తీసుకోవలసి వచ్చింది. దీనివల్ల వ్యయ ప్రయాసలకు గురి కావలసి వచ్చింది. ప్రయాణానికి నానా ఇబ్బందులు పడ్డాను. గతంలో వలే గ్రామంలో వలంటీర్ల ద్వారా ఇంటింటికి పింఛన్ సొమ్ము అందించాలి.

–మండపాక సత్యారావు, పేరంటాలపాలెం గ్రామం, కశింకోట మండలం

'యువత మొదటి ఓటు వైఎస్సార్‌సీపీకే'

అనకాపల్లి: మా గ్రామాన్ని అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీకే తాము ఓటు వేస్తామని కొత్తగా ఓటు హక్కు పొందిన పలువురు యువకులు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో మొదటి సారిగా ఓటుహక్కు వినియోగించుకోనున్న మండలంలో మామిడిపాలెం గ్రామానికి చెందిన సుమారు 30మంది యువకులు స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే అభ్యర్థి తమ్ముడు మలసాల కుమార్‌రాజాను కలిశారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసినట్టు వారు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేయడమే కాకుండా అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందిస్తోందని చెప్పారు. మరింత అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తామని వారు తెలిపారు.



రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో మామిడిపాలెంకు చెందిన నూతన ఓటర్లతో ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు మలసాల కుమార్‌రాజా

సాక్షి ఫోకస్ sakshi focus

నాలుగు దశాబ్దాలుగా నిరాదరణకు గురై అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పాయకరావుపేట నియోజకవర్గంలో గడచిన ఐదేళ్లలో అభివృద్ధి పరవళ్లు తొక్కుతోంది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేట నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలెన్నింటినో జగనన్న ప్రభుత్వం పరిష్కరించి పేట ప్రజల మన్ననలు పొందింది.



కోటవురట్లలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం

పేట.. ప్రగతి బాట

ఆస్పత్రులు.. ఆహా..

ప్రజలకు వైద్య సేవలు అందించే ఆస్పత్రులకు రూ.9 కోట్లు కేటాయించారు. నక్కపల్లి 30 పడకల ఆస్పత్రిని 50 పడకల స్థాయి ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.3 కోట్లతో అదనపు భవనాలు నిర్మించారు. పాయకరావుపేటలో రూ.1.70 కోట్లతో, ఎస్.రాయవరంలో రూ.1.30 కోట్లతో నూతన పీహెచ్‌సీ భవనాలు నిర్మించారు.

ప్రత్యేకంగా వార్డులు రోగుల కోసం పేయింగ్ రూములు తాగునీరు, వాడుకనీరు సదుపాయం కల్పించారు. కోటవురట్ల 30 పడకల ఆస్పత్రికి **మరో రూ.3 కోట్లు** కేటాయించి అదనపు భవనాలు **నిర్మించారు.** ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో **భాగంగా** ప్రతి గ్రామంలోను వెల్‌నెస్ సెంటర్ **నిర్మించి, వైద్య** సిబ్బందిని నియమించి మెరుగైన **ప్రభుత్వ వైద్య** సేవలు అందిస్తున్నారు.



రూ.3కోట్లతో నక్కపల్లిలో అప్‌గ్రేడ్ చేసిన 50 పడకల ఆస్పత్రి

నక్కపల్లి : జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధితో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో గుర్తించిన సమస్యలు పరిష్కరించడంతో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. సచివాలయాల ద్వారా గ్రామాల్లోనే అన్ని ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ బడులు, ఆస్పత్రులు కొత్త భవనాలు, సదుపాయాలతో అభివృద్ధి చెందాయి. రహదారులు అద్దంలా మారాయి. ఇంటింటి కుళాయిల ఏర్పాటుతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. రైతు భరోసా కేంద్రాలు, అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు వంటి సదుపాయాలు రైతులకు సమకూరాయి. పలు ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసి, సిబ్బందిని **నియమించడంతో ఆరోగ్య సేవలు మరింత మెరుగయ్యాయి. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి నూతన విధానాలతో వైద్యాన్ని ప్రభుత్వం** ప్రజలకు చేరువ చేసింది.

వ్యవ'సాయం'

1984 నుంచి 2009 వరకు పాతికసంవత్సరాల పాటు నియోజక వర్గ ప్రజలు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టినప్పటికీ ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదు. 2004లో మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేక నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన పాయకరావుపేట నియోజకవర్గ వాటాగా రావాల్సిన 35 క్యూసెక్కుల తాండవ జలాల విడుదలకు చర్యలు తీసుకున్నారు. సముద్రంలో వృధాగా కలిసిపోతున్న తాండవ జలాలకు అడ్డుకట్ట వేసి సాగుకు ఉపయోగించే విధంగా రూ. 8 కోట్లతో మినీ ఆనకట్టలు నిర్మించారు. ఫలితంగా భూమి, ముతా, ఆవ, మంగవరం కాలువల దిగువన ఉన్న 15 వేల ఎకరాలకు ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందుతోంది. వరహానదిపై రూ.5 కోట్లతో గట్లు పటిష్ఠం చేశారు. నియోజవర్గానికి తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ గ్రిడ్‌కు రూ.35 కోట్లు మంజూరు చేశారు.

అన్నదాతలు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) నిర్మించి వాటి ద్వారా రైతులకు అన్నిరకాల విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందజేసే కార్యక్రమం చేపట్టారు. పాయకరావుపేటలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్మించారు.

ప్రభుత్వ బడులు 'నాడు-నేడు'


నాడు నేడు పథకం కింద పాఠశాల రూపురేఖలు మార్చివేసిన దృశ్యం

నాడునేడు పథకం ద్వారా నియోజకవర్గంలో మొదటి రెండు విడతల్లో 211 పాఠశాలలకు రూ.92 కోట్లు కేటాయించారు. నూతన భవనాలు, అదనపు తరగతి గదులు, ఆధునిక వసతులతో కూడిన మరుగుదొడ్లు, రన్నింగ్‌వాటర్, తాగునీరు, మినరల్‌వాటర్ ప్లాంట్లు, విద్యార్థుల కోసం డిజిటల్ క్లాసు రూములు, ప్రహరీగోడలు, క్రీడామైదానాలు,బెంచీలు, పాఠశాలలకు ఆకర్షణీయమైన రంగులు వంటి అభివృద్ధి పనులు చేపట్టారు.

జగనన్న కాలనీలు.. ఆనందాల లోగిళ్లు


జగనన్నకాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు

ప్రతి పేదవాడికి సొంత గూడు ఉండాలన్న ఉద్దేశ్యంతో జగనన్న ప్రభుత్వం సంకల్పించింది. నియోజకవర్గంలో దాదాపు 9 వేల మందికి ఉచితంగా లక్షలాది రూపాయల విలువైన ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. ఒక్కొక్క లబ్ధిదారునికి 72 గజాల స్థలం ఉచితంగా ఇవ్వడంతోపాటు, ఇంటి నిర్మాణానికి రూ.1.85లక్షలు ఆర్థిక సాయంగా అందజేసింది. జగనన్నకాలనీలుగా నామకరణం చేసుకుని లబ్ధిదారులంతా తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లనిర్మాణాలు ప్రారంభించి గృహప్రవేశాలు కూడా చేసుకుంటున్నారు.కాలనీల్లో విద్యుత్ సదుపాయం , తాగునీటి సదుపాయం రోడ్లు, కాలువలు నిర్మించారు. వాడుకనీటి సదుపాయం కూడ కల్పించారు. ఈ నాలుగున్నరేళ్లలో 11,280 మంది లబ్ధిదారులకు రూ.77కోట్ల మేర చెల్లింపులుజరిపారు.

రహదారులు అద్దంలా...


పాయకరావుపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన మెయిన్‌రోడ్డు

ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.63.57 కోట్లతో 263 కిలోమీటర్ల కొత్త రోడ్లు నిర్మించడం, పాడయిన రోడ్లకు మరమ్మతులు చేయించడం వంటి పనులు చేశారు. అలాగే గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.16 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించారు. ఇవి గాకుండా ఎమ్మెల్యే అభివృద్ధి నిధులు, ఎంపీ నిధులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో కూడా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయం మెరుగుపరిచారు. పాయకరావుపేట పట్టణంలో రూ.3 కోట్లతో నూతనంగా మెయిన్ రోడ్డు నిర్మించారు. గ్రామాలకు వెళ్లేందుకు లింక్ రోడ్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు చేపట్టారు.

నెరవేరిన కల...డిగ్రీ కళాశాల

2019లో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీల్లో భాగంగా నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. నాడు నేడు పథకం కింద పాఠశాలల రూపురేఖలు మార్చి మౌలిక సదుపాయలు, నూతన భవానాలు, బెంచీలు, విద్యార్థులకు ట్యాబులు, రెండు జతల యూనిఫాం , బ్యాగులు, పుస్తకాలు, షూస్ అందజేశారు.

ఇంటి ముంగిటకే జల్ ధారలు

నియోజకవర్గం మొత్తం మీద రూ.200 కోట్లతో జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీటిని సరఫరా చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ నిధులతో మొత్తం 97 గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు నిర్మించారు. గ్రామాల్లో ప్రతి వీధికి పైపు లైను వేసి కుళాయి పాయింట్లు ఏర్పాటు చేసి ఇళ్ల వద్దకే తాగునీరు సరఫరా చేసే పనులు చేపట్టారు. దాదాపు 70 శాతం పనులు పూర్తియ్యాయి. కొన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరా కూడా ప్రారంభించారు.


జల్‌జీవన్‌మిషన్ కింద ముకుందరాజుపేటలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం


పాయకరావుపేటలో నిర్మించిన సచివాలయంలో వివిధ సేవలను సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు

ప్రజల ముంగిటకే పాలన

సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి తీసుకువచ్చి గ్రామంలోనే 12 ప్రభుత్వ శాఖల సిబ్బందిని అందుబాటులో ఉంచి తమ సమస్యలు పరిష్కారం, ధ్రువపత్రాల కోసం మండల కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా గ్రామాల్లోనే అన్ని పనులు జరిగేలా చర్యలు చేపట్టారు. అవ్వా తాతలకు పింఛను తీసుకోవడానికి పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేందుకు వలంటీరు వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చి ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను ఇంటికి తీసుకెళ్లి అందించే కార్యక్రమం చేపట్టారు.

టీడీపీ హయాం... హామీలతో సరి!

నక్కపల్లి : టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్యకాలంలో హామీలే తప్ప నియోజకవర్గంలో అభివృద్ధి ఏమాత్రం జరగలేదు.

- అప్పట్లో ఎన్నికల ముందు ప్రచారంలో ఈ ప్రాంతానికి వచ్చిన చంద్రబాబు, ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితలు నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని, ఏరియా ఆస్పత్రులను 50 పడకల స్థాయికి పెంచుతామని, పాయకరావుపేట మెయిన్‌రోడ్డును విస్తరిస్తామని, పీహెచ్‌సీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని, అసంపూర్తిగా మిగిలిపోయిన చినదొడ్డిగల్లులో పీహెచ్‌సీని పూర్తి చేస్తామని, హామీలు గుప్పించారు. ఆచరణలో ఎటువంటి పురోగతి లేదు.
- తాండవకు అనుబంధంగా ఉన్న ఆవ, భూమి, ముతా కాలువలను ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చారు. రేవు పోలవరాన్ని పర్యాటకపరంగా అభివృద్ధి చేస్తామన్నారు.
- ఉద్దండపురం వద్ద వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేస్తామంటూ అప్పటి పంచాయతీరాజ్‌శాఖామంత్రి లోకేష్ చేత కొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. ఆచరణలో ఇది కూడా అసంపూర్తిగా వదిలేశారు.
- ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీ నిధులతో గ్రామాల్లో అక్కడక్కడ వీధి రోడ్లు, కాలువలు తప్ప టీడీపీ హయాంలో చెప్పుకోదగ్గ ప్రధాన అభివృద్ధి పని అంటూ ఏమీ జరగలేదు.
- టీడీపీ నాయకులు ఇచ్చిన డిగ్రీ కళాశాల, నక్కపల్లి, కోటవురట్ల 30 పడకల నుంచి 50 పడకలకు వరకు ఆస్పత్రి అప్‌గ్రేడ్, నూతన భవనాలు నిర్మాణం, మెయిన్‌రోడ్డు విస్తరణ, పాయకరావుపేట, ఎస్.రాయవరంలలో కొత్త పీహెచ్‌సీలు నిర్మాణం వంటి హామీలన్నీ ఆ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక గత ఐదేళ్లలో ఆయా అభివృద్ధి పనులు నెరవేర్చారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా



నాలుగేళ్లలోనే నలభై ఏళ్ల అభివృద్ధి చేసి చూపించిన ఘనత జగనన్న ప్రభుత్వానిదే. 2019 నుంచి ఇప్పటి వరకు అన్ని రకాల పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాల్లో సుమారు రూ.3వేల కోట్లు పైగా జమ చేయడం జరిగింది. నియోజకవర్గ చరిత్రలోనే లబ్ధిదారులకు ఇంత మొత్తాన్ని ఆర్థిక సాయం రూపంలో దళారుల ప్రమేయం లేకుండా అందించిన ఘనత జగనన్న ప్రభుత్వానిదే. ఈ పథకాలు, అభివృద్ధి నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోతాయి. నలభై ఏళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్న డిగ్రీ కళాశాల, 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయడం జరిగింది. 2024 ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు మా పార్టీకే ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడం జరిగింది.

– గొల్లబాబూరావు, రాజ్యసభ సభ్యుడు

కనీవినీ ఎరగని అభివృద్ధి



పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో కనివినీ అభివృద్ధి జరిగింది. డీబీటీ, నాన్‌డీబీటీ పథకాల కింద సుమారు రూ.3వేల కోట్లు ఖర్చు చేయడం సాధారణ విషయం కాదు. ప్రజలకు అవసరమైన అన్ని అవసరాలు తీర్చడం జరిగింది. ఇంకా ఏమయినా పూర్తి చేయాల్సిన పనులు ఉంటే ఈ మూడు నెలల కాలంలో పూర్తి చేయడం జరుగుతుంది. ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది.

– కంబాల జోగులు, ఎమ్మెల్యే అభ్యర్థి

చరిత్రలో నిలిచిపోయేలా...

డీబీటీ కింద నియోజకవర్గంలో 2019 నుంచి 2023 వరకు జగనన్న ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం వివరాలు పరిశీలిస్తే...

పథకం పేరు	లబ్ధిదారులు సంఖ్య	మొత్తం (రూ. కోట్లలో)
రైతు భరోసా	41,071	24.30
అమ్మవడి	1,34,514	161.75
వైఎస్సార్ చేయూత	15,882	803
వైఎస్సార్ ఆసరా	67,093	1600
పింఛన్లు	47,881	127.72
కాపునేస్తం	31,138	46.70
వాహనమిత్ర	8867	8.87
ఆరోగ్యశ్రీ	24,555	50.37
గృహనిర్మాణం	11,820	78
సున్నావడ్డీ	78,694	24.75
జగనన్న తోడు	5545	5.54
నాడు–నేడు పాఠశాలల సంఖ్య	211	56.27

ఇవికాకుండా రూ.27 కోట్లతో 68 సచివాలయాలు, రూ.12 కోట్లతో 56 రైతు భరోసా కేంద్రాలు, రూ.11 కోట్లతో 48 వెల్‌నెస్ సెంటర్లు నిర్మిస్తున్నారు. పాయకరావుపేటలో రూ.82 లక్షలతో అగ్రిటెస్టింగ్ ల్యాబ్ నిర్మించారు.

మీకు తెలుసా?

మన ఓటు మనం చూడొచ్చు

ఏడు సెకన్ల వరకే అవకాశం



యలమంచిలి రూరల్ : ఎన్నికల సంఘం పారదర్శకతకు పెద్దపీట వేసి జవాబుదారీగా నిలవాలని నిర్ణయించింది. ఈవీఎంలకు ముందు ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ వాడితే ఓటరు తాను ఎవరికి ఓటు వేశాడో స్పష్టంగా తెలిసేది. ఈవీఎంలు వచ్చాక ఆ వెసులుబాటు పోయింది. అనంతర కాలంలో ఓటరు తాను వేసిన ఓటు సంబంధిత వ్యక్తికే పడిందా లేదా తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం వీవీప్యాట్ (ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్)ను ప్రవేశపెట్టింది. ఓటరు ఓటు వేయగానే వీవీప్యాట్‌లో చూసుకోవాలి. ఇది అభ్యర్థి క్రమ సంఖ్య, పేరు, గుర్తును ముద్రిస్తుంది. ఆ పేపరు ఏడు సెకన్లు మాత్రమే కనిపిస్తుంది. తర్వాత దానంతటదే వీవీప్యాట్‌లోని బాక్సులో పడిపోతుంది. దీన్ని తొలిసారిగా 2013 సెప్టెంబరులో నాగాలండ్‌లో గల నోక్సె అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. తదుపరి అదే ఏడాది మిజోరాం అసెంబ్లీ ఎన్నికల్లో 10 నియోజకవర్గాల్లో వినియోగించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో 8 లోక్‌సభ స్థానాల్లో, 2017 గోవా అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో వినియోగించారు. ఈ యంత్రాలను సీల్ చేసే పేపర్, స్ట్రిప్ సీల్ తదితరాలను నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ మాత్రమే తయారు చేస్తుంది.

పల్లెవించిన రాజకీయ చైతన్యం


- గాంధీ నడిచిన నేల.. తీపిని పంచిన పల్లి
- ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక కొలువైన ప్రాంతం
- బౌద్ధం పరిఢవిల్లిన బొజ్జన్న కొండ
- ఇక్కడి నుంచి గెలిస్తే మంత్రి పదవి ఖాయమని సెంటిమెంట్

చక్కని పల్లె వాతావరణం... చుట్టూ పచ్చని పొలాలు.. పక్కనే గలగలా పారే శారదా నది.. చెంతనే అమ్మా.. అని పిలిస్తే కాచికాపాడే నూకాంబిక ... గత వైభవ బౌద్ధమత దీప్తులకు గురుతుగా అలరారుతున్న బొజ్జన్న కొండ...ఇవన్నీ కలిస్తే అందమైన పట్టణ పోకడ లున్న అనకాపల్లి నియోజకవర్గం. క్రీస్తుశకం 9వ శతాబ్దంలో అనగాపల్లిగా పేరుపొందిన ఈ ప్రాంతం రానురాను అనకాపల్లిగా మారింది. అనకాపల్లి నుంచి సీపీఐ నేత దివంగత కొడిగంటి గోవిందరావు, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ వ్యవస్థాపకుడు దివంగత వి.వి.రమణ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహంతో ఈ ప్రాంతం మార్మోగింది. ఆ సమయంలో జాతిపిత మహాత్మాగాంధీ అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు, బెల్లంమార్కెట్‌కు వచ్చారు. బ్రిటిష్ కాలంలో 1830వ సంవత్సరంలో తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, న్యాయస్థానం ఉండేవి. ఈ ప్రాంతవాసులు రాజకీయంగా ఎంతో చైతన్యవంతులు.


– అనకాపల్లి

అనకాపల్లి

నియోజకవర్గంలో ఓటర్లు	:	2,13,714
పురుషులు	:	1,03,088
మహిళలు	:	1,10,621
ఇతరులు	:	5
పోలింగ్ బూత్‌లు	:	251




నూకాంబిక అమ్మవారు


బొజ్జన్న కొండ

నియోజకవర్గ స్వరూపం

అనకాపల్లి నియోజక వర్గంలో అనకాపల్లి పట్టణం, మండలం, కశింకోట మండలాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గానికి సరిహద్దుల్లో యలమంచిలి నియోజకవర్గంలోని మునగపాక, రాంబిల్లి మండలాలు, పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ, సబ్బవరం మండలాలు, మాడుగుల నియోజకవర్గంలోని కోటపాడు, చోడవరం నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, పాయకరావుపేట నియోజకవర్గంలో కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాలున్నాయి. అనకాపల్లి పట్టణంలో ఐదు వార్డులు జీవీఎంసీ పరిధిలో ఉన్నాయి.


అనకాపల్లి బెల్లం మార్కెట్

నియోజకవర్గం ప్రత్యేకతలు

- 1945వ సంవత్సరంలో అనకాపల్లి కేంద్రంగా బెల్లం మార్కెట్ ఏర్పడింది. దేశంలోనే రెండోవస్థానం పొందిన మార్కెట్‌గా ప్రసిద్ధిచెందింది.
- 1942వ సంవత్సరంలో శారదా గ్రంథాలయం, 1943లో గౌరీగ్రంథాలయం స్థాపించారు
- అనకాపల్లి మండలంలో పర్యాట ప్రాంతంగా, బౌద్ధారామంగా గుర్తింపు పొందిన బొజ్జన్నకొండ సుమారుగా 2వేల సంవత్సరాల క్రితం ఏర్పడింది. ప్రతి ఏడాది వేలాదిమంది టూరిస్టులు ఈ కొండను సందర్శిస్తారు.
- అనకాపల్లి మండలంలోనే తొలి సహకార పరిశ్రమ తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఏర్పాటు అయింది.
- అనకాపల్లి కేంద్రంగా ఏఎంఎఎల్ కళాశాలను వర్తకసంఘం ఆధ్వర్యంలో 1945వ సంవత్సరంలో ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇచ్ఛాపురం నుంచి తుని వరకూ లక్షలాది మంది విద్యార్థులు ఇక్కడ చదువుకున్నారు.
- ఉత్తరాంధ్ర ఇలవేల్పుగా ప్రసిద్ధిగాంచిన నూకాంబిక అమ్మవారి దేవాలయంలో అనకాపల్లి పట్టణంలో ఉంది. ఏటా దేశవిదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు.
- కశింకోట మండలంలో 1972వ సంవత్సరంలో ఆర్‌ఈసీఎస్ సంస్థను ఏర్పాటు చేశారు.
- కశింకోట మండల పరిధిలో పలు సిమెంట్ ప్యాక్టరీలు ఉన్నాయి.


మలసాల భరత్‌కుమార్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి


కొణతాల రామకృష్ణ జనసేన అభ్యర్థి

2024 ఎన్నికల ముఖ చిత్రం

ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, జనసేన అభ్యర్థులు ప్రధాన ప్రత్యర్థులుగా బరిలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున మలసాల భరత్‌కుమార్ పోటీ చేస్తుండగా, జనసేన తరఫున కొణతాల రామకృష్ణ బరిలో ఉన్నారు. ఈయన చాలా కాలం నుంచి నియోజకవర్గానికి దూరంగా ఉండి, తిరిగి ఎన్నికలకు కొద్దికాలం ముందు అభ్యర్థిగా తెరమీదకు వచ్చారు. పెద్దగా ప్రజల్లో తిరిగిన దాఖలాలు లేవు. మరోవైపు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమరనాథ్ సుమారు ఎనిమిది వేల ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించడమే దీనికి నిదర్శనం. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలతో అన్నివర్గాల వారు వైఎస్సార్‌సీపీకి బలమైన మద్దతుదారులుగా ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీవైపే మొగ్గు కనిపిస్తోంది.

రాజకీయ పోరు

ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో అనకాపల్లికి ఆనుకుని ఉన్న పరవాడ మండలంలోని పలు గ్రామాలను అనకాపల్లి మండలంలో కలిపారు. మునగపాక మండలంలోని కొన్ని గ్రామాలు అనకాపల్లి నియోజకవర్గంలో ఉండేవి. పునర్విభజన తరువాత వాటిని యలమంచిలి నియోజవర్గంలో కలిపారు.ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిగెలిచిన వారికి మంత్రి వర్గంలో బెర్త్ ఖాయమవుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తారు. అదేవిధంగా ముఖ్యమంత్రితో సన్నిహితంగా ఉంటారనే సెంటిమెంట్ కూడా ఉంటుంది.

సంవత్సరాల వారీగా విజయం సాధించిన వారి వివరాలు

1952	కె.గోవిందరావు(సీపీఐ)
1955	భీశెట్టి అప్పారావు(కృషికార్ లోక్‌పార్టీ)
1962	కె.గోవిందరావు(సీపీఐ)
1967	కె.గోవిందరావు(సీపీఐ)
1972	పి.వి.రమణ(కాంగ్రెస్)
1978	కె.గోవిందరావు(సీపీఐ)
1983	రాజా కన్నబాబు(టీడీపీ)
1985	దాడి వీరభద్రరావు(టీడీపీ)
1989	దాడి వీరభద్రరావు(టీ డీపీ)
1994	దాడి వీరభద్రరావు(టీడీపీ)
1999	దాడి వీరభద్రరావు(టీడీపీ)
2004	కొణతాల రామకృష్ణ(కాంగ్రెస్)
2009	గంటా శ్రీనివాసరావు (ప్రజా రాజ్యం)
2014	పీలా గోవింద సత్యనారాయణ(టీడీపీ)
2019	గుడివాడ అమర్‌నాథ్(వైఎస్సార్‌సీపీ)